నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 27 మార్చి 2025 | HYDERABAD

గ్రేటర్ @ 36.7

గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 36.7, కనిష్ఠం 23.2 డిగ్రీలు, గాలిలో తేమ 24శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాగల వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువకానున్నట్లు అధికారులు వెల్లడించారు.

- సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ)

అమెజాన్‌లో కర్టెన్ ఆర్డర్ చేస్తే..

సిటీబ్యూరో, మార్చ్ 26 (నమస్తే తెలంగాణ): అమెజాన్‌లో కర్టెన్స్ ఆర్డర్ పెడితే.. మురికి బట్టలు వచ్చాయంటూ నగరానికి చెందిన ఓ మహిళ లబోదిబోమంటోంది. ఈనెల 21న అమెజాన్‌లో ఆఫర్ ఉంది కదా అని.. కర్టెన్స్ ఆర్డర్ చేసింది. బుధవారం ఆర్డర్ ఇంటికి రాగా, పార్సిల్ ఓపెన్ చేసి చూస్తే అందులో చెడు వాసనతో కూడిన మురికి బట్టలు మూడు కనిపించాయి. ఏం చేయాలో తెలియక సోషల్ మీడియాలో తన అనుభవాన్ని తెలియజేస్తూ.. వీడియో వైరల్ చేసింది. ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌ను పూర్తిగా నమ్మవద్దని, అటువంటి వాటిలో జరిగే మోసాలతో వినియోగదారులుగా తాము నష్టపోతున్నామంటూ ఆ మహిళ చెప్పింది. కర్టెన్స్ బదులు వేరే మురికి బట్టలు వచ్చాయి.. కానీ అదే ఫుడ్ ఐటమ్స్ అయితే ఎక్స్‌పైరీ డేట్ కూడా లేకుండా పంపుతున్నారని, వీటి విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ సూచించింది.

పాలనలో విఫలమై.. వివాదాలకు దగ్గరై

చర్చనీయాంశమవుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీరు

అన్ని పార్టీల నేతలతో తరచూ ఏదో ఒక లొల్లి

తాజాగా ఎంఐఎం స్టాండింగ్ కమిటీ సభ్యులతో గొడవ

మేయర్ కనిపించడం లేదంటూ.. ప్రజావాణిలో బీజేపీ కార్పొరేటర్ ఫిర్యాదు

ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోనే అత్యధిక జనాభాకు అత్యవసర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీ పరిధికి ఫస్ట్ సిటిజన్‌గా వ్యవహరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వివాదాలకు కేంద్ర బిందువుగా మారారా..? అటు మేయర్‌గా, ఇటు రాజకీయంగా విఫలం చెంది కాంట్రావర్సీకి కామన్‌గా మారారా..? అన్ని పార్టీల కార్పొరేటర్లతో ఆమెకు సఖ్యత కొరవడిందా? ప్రజల మౌలిక వసతుల కల్పన, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సమష్టిగా అందరినీ కలుపుకొనిపోవాల్సిన మేయర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారా..? అంటే కార్పొరేషన్ వర్గాలు అవుననే అంటున్నాయి. గడిచిన కొంత కాలంగా తరచూ ఏదో పార్టీ నేతలతో వివాదానికి కేరాఫ్‌గా మారుతున్నారు. సొంత పార్టీ నేతల నుంచి ప్రతిపక్ష పార్టీల నేతల వరకు మేయర్ వ్యవహరిస్తున్న తీరు గ్రేటర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వరుస వివాదాల్లో..

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వరుసగా వివాదాల్లో చిక్కుతున్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మేయర్.. తరచూ అన్ని పార్టీల నేతలతో వివాదాలు పెట్టుకుంటున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఇవ్వడం లేదని, అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ల ప్రతిపాదనలను పట్టించుకోవడం లేదని గులాబీ నేతలు మేయర్ తీరును ఎండగడుతూ వస్తున్నారు. ఖైరతాబాద్, లక్డీకాపూల్‌లో హోటళ్లపై తనిఖీల సందర్భంలో అధికార పార్టీ నేతల నుంచే వివాదాలు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఉప్పల్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ వివాదం, గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో జరిగిన గ్రేటర్ నేతల సమన్వయ సమావేశంలో మేయర్ వ్యాఖ్యలు భారీ దుమారాన్ని రేపాయి. చివరకు మేయర్ తండ్రి, ప్రభుత్వ సలహాదారు కేశవ రావు జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఇటీవల కాలంలో ఎంఐఎం పార్టీ నేతలతో తరచూ వివాదాల్లో నిలుస్తున్నారు. ఎమ్మెల్సీ భేగ్ ఎపిసోడ్ ముగియకముందే తాజాగా గత వారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంఐఎం పార్టీ సభ్యులతో గొడవకు దిగారు. చెరువుల పరిరక్షణలో ఆ పదకొండు చెరువులే ఎందుకని? మరిన్ని చెరువులను చేర్చుదామన్న ఎంఐఎం పార్టీ సభ్యుల ప్రతిపాదనను మేయర్ సున్నితంగా తిరస్కరించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి అనధికార మిత్రపక్షమైన ఎంఐఎం పార్టీకి చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులు మేయర్ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. రాబోయే స్టాండింగ్ కమిటీలో పెట్టనున్న ఇతర ప్రతిపాదనలకు తమ ప్రమేయం లేకుండా స్టాండింగ్ కమిటీ ఆమోదం ఎలా పొందుతారన్నది ఎంఐఎం సభ్యులు ప్రశ్నిస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో మేయర్ తీరుపై ఇప్పటికే సభ్యులు తమ నేత అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకువెళ్లారని, త్వరలోనే కాంగ్రెస్ పెద్దలను కలిసి మేయర్‌పై ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక బీజేపీ విషయానికొస్తే ప్రొటోకాల్ వివాదంతో పాటు మేయర్ కనిపించడం లేదంటూ బీజేపీ కార్పొరేటర్ గత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మొత్తంగా మేయర్ విద్యావంతురాలైనా.. రాజకీయ సమయానుకూలంగా రాజకీయ వ్యూహాలు రచించడం, ఎత్తుగడలు వేయడంలో విఫలమై.. తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతుండడం గమనార్హం.

మేయర్ వివాదాల్లో కొన్నింటిని పరిశీలిస్తే....!

☞ గోషామహల్ నియోజకవర్గంలోని చాదర్‌ఘాట్‌లో జీహెచ్ఎంసీకి సంబంధించిన ఆజాద్(మోతి)మార్కెట్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేసి, కలుషిత, అపరిశుభ్రమైన, నాణ్యత లేని నాన్‌వెజ్ విక్రయాలు జరుపుతున్న రెండు చికెన్ షాపులను తక్షణమే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే మజ్లిస్ పార్టీ ఎమ్మెల్సీ బేగ్, కొందరు వార్డు మెంబర్లు అక్కడకు చేరుకుని జీహెచ్ఎంసీ అధికారులను బెదిరించారు. సీజ్ చేసి తీసుకువెళ్లిన చికెన్‌ను బలవంతంగా తీసుకువెళ్లారు. తిరిగి 24 గంటల వ్యవధిలోనే షాపులను తెరిపించి యథేచ్ఛగా వ్యాపారం సాగేలా చేశారు. ఈ విషయంలో మేయర్ ఆదేశాలు డోంట్‌కేర్..ఇంట్లో ఎలుకలు ఉన్నాయని, ఇంటిని సీజ్ చేసుకుంటామా? అంటూ ఎమ్మెల్సీ బేగ్ మేయర్ తనిఖీల తీరును ఎండగట్టారు. కానీ నేటికీ ఆ మార్కెట్‌లో మేయర్ ఆదేశాలు ఎక్కడ అమలుకు నోచుకోలేదు.

☞ స్టాండింగ్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు బాలానగర్‌లో మేయర్ పర్యటించిన సందర్భంగా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీ బండి రమేశ్‌కు సమాచారం లేకుండా బీఆర్ఎస్ కార్పొరేటర్ పిలువకాగానే బాలానగర్‌లో పర్యటనకు ఎందుకు వచ్చారని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఒక్కసారిగా షాక్‌కు గురైన మేయర్.. ఇంతకు మీరెవరూ..? మీతో నాకు పరిచయమే లేదు..? నన్నెందుకు సమాచారం ఇవ్వలేదని అడుగుతున్నారు...? మీ నంబర్లు నా వద్ద లేవుగా.. ఎలా సమాచారం ఇవ్వాలి' అని అనడంతో కాంగ్రెస్ నేతలందరూ ఒక్కసారిగా విస్తుపోయారు.

☞ బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ముందు ఖాళీ స్థలంలో చాలా ఏళ్లుగా వారంతపు సంత నిర్వహిస్తుంటారు. సాయంత్రం నుంచి రాత్రి 10గంటల దాకా నడుస్తున్న ఈ సంతల్లో చిరు వ్యాపారుల వద్ద నుంచి మేయర్ మనుషులుగా చెలామణి అయ్యే కొంత మంది మహిళలు ముఠాగా ఏర్పడి డబ్బులు వసూలు చేసుకుంటారు. ప్రతి శనివారం సుమారు రూ.15వేల నుంచి 18వేల దాకా హప్తా వసూల్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

☞ మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లలో హౌస్ ఓనర్స్‌గా వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ఏర్పడిన ఈ గ్రూప్ చివరకు మేయర్ మనుషులు దాడి చేసే వరకు వెళ్లింది. మేయర్ మనుషుల జరిపిన దాడితో అవమానభారంతో బీజేపీ చెందిన మహిళ కార్యకర్త పావని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. పావనీ మనుషులతో పాటు బీఆర్ఎస్ కార్యకర్త రాజు ముదిరాజ్ సైతం మేయర్ మనుషులతో ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. మొత్తంగా వాట్సాప్ గ్రూప్‌లో పెద్ద దిక్కుగా ఉన్న మేయర్.. సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయ కక్ష్య సాధింపు చేపట్టడం ఏమిటని బాధితులు, స్థానికులు ఆరోపణలు గుప్పించారు.

భద్రత పెంచుతాం

లేడీస్ కోచ్‌లలో కెమెరాలు

ఎంఎంటీఎస్ ఘటనలో దర్యాప్తు వేగవంతం

ప్రయాణంలో ఇబ్బందులొస్తే మహిళలు 139కి కాల్ చేయాలి

రైల్వే ఎస్పీ చందనా దీప్తి

II

మెట్రోలో ఉగాది వేడుకలు

సిటీబ్యూరో, మార్చి 26(నమస్తే తెలంగాణ): అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఎల్ అండ్ టీ హెచ్ఎంఆర్ఎల్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించనున్నారు. 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే మెట్రో ఫెస్ట్–ఉగాది వేడుకల్లో భాగంగా మెట్రో ప్రయాణికులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు జరుగుతాయని ఎల్ అండ్ టీ వర్గాలు వెల్లడించాయి. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా, సామాజిక అనుసంధాన వేదికగా మెట్రో ఫెస్ట్‌లో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తిరుమలలో గదుల కోసం చూస్తుంటే..

బంజారాహిల్స్, మార్చి 26: తిరుమలలో గదుల కోసం ఆన్‌లైన్‌లో వెతికిన వ్యక్తిని సైబర్ మోసగాళ్లు బురిడీ కొట్టించారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. కమలాపురికాలనీలో నివాసం ఉంటున్న చిరుమామిళ్ల ప్రసాద రావు అనే వ్యాపారి ఇటీవల తిరుమల వెళ్లడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో తిరుమలలో గదులు బుకింగ్ చేసుకునే ఉద్దేశంతో గూగుల్‌లో సెర్చ్ చేస్తున్న క్రమంలో ఓ లింక్ ఓపెన్ అయింది. దానిలో సూచించిన ప్రకారం గది బుక్ చేసుకునే క్రమంలో అమన్ పరాస్ అనే పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ప్రసాదరావు అకౌంట్ నుంచి గూగుల్ పే ద్వారా రూ.10వేలు కాజేశారు. ఈ మేరకు బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బీఎన్ఎస్ 318(4), 319(2)తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఐపీఎల్ కోసం స్పెషల్ బస్సులు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా నగరంలోని వివిధ మార్గాల నుంచి ఉప్పల్ స్టేడియానికి 60 ఆర్టీసీ బస్సులను ప్రవేశపెట్టినట్టు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సన్ రైజర్స్ హైదరాబాద్, లక్నో మధ్య పోటీ ఉండనున్నది. ఏప్రిల్ 6, 12, 23 మే 5, 10, 20, 21న మ్యాచ్‌లు జరగనున్నాయి. అందులో భాగంగా మ్యాచ్‌లు జరిగే రోజు బస్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఘట్‌కేసర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, లక్డీకాపూల్, దిల్‌సుక్‌నగర్, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, మియాపూర్, జేబీఎస్, హఫీజ్‌పేట, ఈసీఐఎల్, బోయిన్‌పల్లి, చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం, కొండాపూర్, బీహెచ్ఈఎల్ తదితర ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు వివరించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులివ్వండి

సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే నిధులను కేటాయించాలని అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పైప్ లైన్‌లు, పార్కులు, శ్మశాన వాటికల నిర్మాణం కోసం సుమారు రూ. 30 కోట్ల నిధులను సత్వరమే మంజూరు చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అలాగే కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ గ్రామంలోనీ సర్వే నంబర్.145, 163లలో నిర్మాణ అనుమతులు నిలిపివేశారని, గతంలో అన్ని ప్రభుత్వాలు ఈ కాలనీలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాయని, ఇటీవల కాలంలో అకస్మాతుగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలేదన్నారు. కాలనీలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఎన్టీయూహెచ్ వెనకాల ఉన్న సాయి నగర్ కాలనీలో ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని, 2014 కు ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు డబ్బులు చెల్లించేందుకు కాలనీవాసులు సిద్ధంగా ఉన్నారని, వారికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. వినతి పత్రాలను సంబంధిత అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



యూనైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు, బీసీ సంఘాల నేతలతో స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, వివేకానంద్, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి

మరింత పారదర్శకంగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

త్వరలో సీఆర్ఎస్ విధానం అమలు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పరిధిలో బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేందుకు నూతన విధానాన్ని అమలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ నిర్ణయించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సివిలియన్స్ రిజిస్ట్రేషన్ సిస్టం(సీఆర్ఎస్) పరిధిలోకి బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ విధానాన్ని తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం అమలవుతున్న విధానం ద్వారా అవినీతి, అక్రమాలు జరగడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బడిముబ్బడిగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ జరుగుతున్నదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సీఆర్ఎస్ విధానం ద్వారా అక్రమాలకు తావులేకుండా ఉంటుందని అధికారులు భావించారు. ప్రస్తుతం ఈ విధానం జీహెచ్ఎంసీ అవతల ఉన్న మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో ఇప్పటికే అమలు చేయాల్సి ఉండగా.. కుల గణన సర్వే, ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక ఫోకస్ ఉండడంతో సమయాన్ని తీసుకున్నారు. ఈ విధానం అమలు కోసం పూర్తిగా అనుభవం ఉన్న అధికారులను ఎంపిక చేసి తొలుత శిక్షణ ఇచ్చి ఆ తర్వాత వచ్చే నెల మొదటి వారం నుంచి అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మాట్లాడుతున్న మల్కాజిగిరి సర్కిల్ జేఏసీ అధ్యక్షుడు వెంకన్న

మల్కాజిగిరి అభివృద్ధికి రూ.384.82 కోట్లు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

మల్కాజిగిరి: అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని మల్కాజిగిరి సర్కిల్ జేఏసీ అధ్యక్షుడు వెంకన్న అన్నారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం రూ.384.82 కోట్ల నిధులను మంజూరు చేయించి.. నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజిగిరి నియోజక వర్గంలో రూ.384.82కోట్లతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆనంద్‌బాగ్‌లోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి రామకృష్ణాపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వద్ద రూ.210కోట్లతో మరో ఆర్ఓబీ, రూ.35కోట్లతో ఆర్‌యూబీని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంజూరు చేయించారన్నారు. జీహెచ్ఎంసీ నుంచి సాధారణ పనుల కోసం రూ.7కోట్లు, బాక్స్ డ్రైనేజీకి రూ.6కోట్లు, మౌలాలిలోని బండ చెరువు వద్ద రూ.1.7కోట్లతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించారని చెప్పారు. వాజ్‌పేయినగర్ వద్ద ఆర్‌యూబీ రూ.72కోట్లు, గౌతంనగర్ వద్ద రూ.28కోట్లు, అల్వాల్ సర్కిల్ తుర్కపల్లి వద్ద రూ.8కోట్లు, జనప్రియ అపార్టుమెంట్ వద్ద రూ.8కోట్లతో ఆర్‌యూబీలు నిర్మించనున్నారని పేర్కొన్నారు. మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్‌ల్లో విద్యుత్ సమస్యలు రాకుండా రూ.9.74కోట్లతో త్రీ ఫేస్ సరఫరా, కొత్తగా ట్రాన్స్ ఫార్మర్లు, ఇంటర్ లింక్ ఫీడర్లను ఏర్పాటు కానున్నాయని వెల్లడించారు. డిగ్రీ కాలేజీకి 2 ఎకరాల స్థలం కేటాయింపు, 500 గజాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు స్థలాలను ఎమ్మెల్యే మంజూరు చేయించారన్నారు. ఇప్పటికే నేరేడ్‌మెట్‌లో జిల్లా కోర్టు భవనాలను రూ.46కోట్లతో నిర్మిస్తున్నారని, అల్వాల్‌లో 11 గుంటల స్థలంలో ఫైర్ స్టేషన్ మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత యాదవ్, మురుగేశ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, అంజయ్య, పరశురాంరెడ్డి, రాముయాదవ్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో ఇదేం నీరు

బండ్లగూడ కార్పొరేషన్‌లో కలుషిత నీరు సరఫరా

బండ్లగూడ, మార్చి 26: బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలో కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్భాటంగా ప్రారంభించిన ఫిల్టర్ బెడ్ల ద్వారానే మురికి నీరు రావడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. హిమాయత్ సాగర్ నుంచి సరఫరా అయ్యే నీటిని శుద్ధిచేసి పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం హిమాయత్ సాగర్ వద్ద ఇటీవల ఐదు ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు దీనిని ఆర్భాటంగా ప్రారంభించారు. దీనికోసం 6 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. ఇక అప్పటి నుంచి మంచినీటి కష్టాలు తీరాయని ప్రజలు భావించారు. అయితే ఆ ఫిల్టర్ బెడ్లు సరైన రీతిలో పనిచేయకపోవడంతో కలుషిత నీళ్లు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

విష జ్వరాలు రావా..

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ నుంచి పంపిణీ చేస్తున్న మంచినీరు కలుషితంగా వస్తున్నాయని బుధవారం ఉదయం హిమాయత్ సాగర్ గ్రామస్తులు జలమండలి అధికారి గోవింద్ నిలదీశారు. కలుషిత నీళ్లు తాగితే తమకు విష జ్వరాలతో పాటు అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిల్టర్లను మరోసారి తనిఖీలు చేసి నీటిని శుభ్రపరచాలని వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే హిమాయత్ సాగర్ జలాశయం నుంచి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు గ్రామాలకు పంపిణీ చేస్తున్న మంచినీటిని పూర్తిస్థాయిలో ఫిల్టర్ చేసి ప్రజలకు అందించాలని స్థానికులు కోరుతున్నారు. 20 రోజులుగా తమకు కలుషిత నీరు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని కలుషిత నీరు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోజూ 1,20,000 లీటర్లు

బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీలకు హిమాయత్ సాగర్ జలాశయం నుంచి 1,20,000 లీటర్ల నీటిని ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నామని జల మండలి అధికారి గోవింద్ గౌడ్ తెలిపారు. ఏదైనా పని జరిగి ఉంటే మట్టి నీళ్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఫిల్టర్ చేసిన నీళ్లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.